# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :64 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 07-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇక రుణాలు చౌకే.. భారీగా తగ్గనున్న వడ్డీరేట్లు

న్యూఢిల్లీ, : రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత తదితర లోన్లపై వడ్డీరేట్లు తగ్గబోతున్నాయన్న సంకేతాలను ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 125 నుంచి 150 బేసిస్ పాయింట్లదాకా తగ్గించే వీలుందని సోమవారం ఎస్బీఐ రిసెర్చ్ ఓ నివేదికను విడుదల చేసింది. ఇదే జరిగితే ఆ మేరకు ఆయా బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు కూడా కస్టమర్లకు తక్కువ వడ్డీకే అప్పులివ్వనున్నాయి. అలాగే ఇప్పటికే తీసుకున్న రుణాలపైనా వడ్డీరేట్లు తగ్గి, ఈఎంఐ భారం దిగొచ్చే వీలున్నది.

## పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం



పహల్గాం ఉగ్రదాడి లో మరణించిన వారి కుటుంబాలకు అసోం ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. ఈ మేరకు అసోం కేబినెట్ మంగళవారం తీర్మానం చేసింది. ఈ విషయాన్ని అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి జరిగింది. పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. మహిళలను, చిన్నారులను వదిలేసి పురుషులపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మొత్తం 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 25 మంది భారతీయులు ఉన్నారు. మరొకరు నేపాల్‌కు చెందిన వ్యక్తి. ఈ ఘటన నేపథ్యంలో ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

## విద్యార్థికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభినందన



మునుగోడు, మే 06 : నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన పేదింటి విద్యా కుసుమం దుబ్బసాయి శ్రీ వర్షిత్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో వృత్తి విద్య కోర్సు (ఎంఎల్‌టీ) పూర్తి చేశాడు. 991/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసానికి విద్యార్థిని పిలిపించుకుని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## ఫెడరల్ నిధులు నిలిపివేత



అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి షాక్ ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులను నిలిపివేశారు. అమెరికా ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మాన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రభుత్వ డిమాండ్లను పాటించడం లేదనే కారణంతో ట్రంప్ సర్కార్ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ డిమాండ్లను నెరవేర్చే వరకు హార్వర్డ్‌కు ఎటువంటి కొత్త గ్రాంట్లు మంజూరుచేయబోమని స్పష్టం చేశారు. ఫెడరల్ పరిశోధన గ్రాంట్లకు మాత్రమే ఈ నిషేధం వర్తిస్తుందని తెలిపారు. యూనివర్సిటీ ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి విద్యార్థులకు సహాయపడే ఫెడరల్ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్యాశాఖ విద్యాశాఖ వెల్లడించింది.

కాగా, అడ్మిషన్ విధానాలు, ఆడిట్, కొన్ని స్టూడెంట్ క్లబ్‌ల గుర్తింపు రద్దు వంటి సంస్కరణలు చేపట్టాలని ట్రంప్ సర్కార్ కోరగా.. అందుకు వర్సిటీ స్పందించలేదు. ప్రభుత్వానికి లొంగేది లేదని స్పష్టం చేసింది. దీంతో హార్వర్డ్‌పై ట్రంప్ పలు ఆంక్షలు విధిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ మధ్యలోనే ట్రంప్ ప్రభుత్వం ఆ వర్సిటీకి అందాల్సిన 2.2 బిలియన్ డాలర్ల ఫెడరల్ నిధులను స్తంభింపజేసింది. మొత్తం 9 బిలియన్ డాలర్ల నిధులపై సమీక్ష జరుగుతోందని అప్పట్లో తెలిపింది. తాజా లేఖతో భవిష్యత్తులో హార్వర్డ్‌కు ఎలాంటి కొత్త గ్రాంట్లు అందవని మెక్‌మాన్ తేల్చి చెప్పారు.

## లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన రాహుల్ గాంధీ



గత నెల 22న జమ్ము కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి లో లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. ఇవాళ ఉదయం హర్యానాలోని కర్నాల్‌కు చేరుకున్న రాహుల్.. వినయ్ నర్వాల్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ వినయ్ నర్వాల్‌కు నివాళులర్పించారు. అనంతరం నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ రెండేళ్ల కిందట భారత నౌకాదళంలో చేరారు. కేరళలోని కొచ్చిలో విధులు నిర్వహిస్తున్నారు. అంకితభావంతో పని చేసే అధికారిగా సహచరులు, ఉన్నతాధికారుల నుంచి ఆయన మన్ననలు పొందారు. ఏప్రిల్ 16న వినయ్ నర్వాల్‌కు పెళ్లి జరిగింది. 19న రిసెప్షన్ తర్వాత హనీమూన్ కోసం ఈ జంట జమ్ముకశ్మీర్‌కు వెళ్లింది. 22న జరిగిన ఉగ్రదాడిలో నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడిలో ఇద్దరు విదేశీలతో సహా 26 మంది మరణించగా మరికొందరు గాయపడ్డారు.

## లష్కరే పాత్ర ఉందా? పాకిస్థాన్‌ను నిలదీసిన యూఎన్ భద్రతా మండలి



న్యూయార్క్: పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన అంశాన్ని ఇవాళ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో లేవనెత్తారు. పాకిస్థాన్ చేస్తున్న వాదనలను కొట్టివేస్తూ భద్రతా మండలి సభ్యులు కొన్ని ప్రశ్నలు వేశారు. బైసారన్‌లో జరిగిన నరమేధం వెనుక లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ హస్తం ఉందా లేదా అన్న ప్రశ్న వేశారు. ఈ అంశంలో పాకిస్థాన్‌ను యూఎన్ భద్రతా మండలి సభ్యదేశాలు గట్టిగా నిలదీశాయి. పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద ఘటనను అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఆ ఘటన పట్ల బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని యూఎన్ చెప్పింది. మతం పేరిట పర్యాటకులను టార్గెట్ చేయడాన్ని భద్రతా మండలి సభ్యులు తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ చేపడుతున్న క్షిపణి పరీక్షలను కూడా యూఎస్ సభ్య దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలాంటి సమసయంలో అణ్వాయుధ క్షిపణి పరీక్షలు చేయడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను ఎందుకు పెంచుతున్నట్లు పాకిస్థాన్‌ను అడిగారు. పెహల్గామ్ దాడి ఘటనలో తమను నిందిస్తున్నట్లు పాకిస్థాన్ చేస్తున్న వాదలను యూఎన్ సభ్య దేశాలు కొట్టిపారేశాయి. భారత్‌తో సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలని కొన్ని దేశాలు సూచించాయి.

## రాష్ట్ర ఆదాయాన్ని లూటీ చేసి ఢిల్లీకి మూటలుగా మోస్తున్నారు



రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ దుమారం రేపుతున్నాయి. సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పాలన చేతగాని అసమర్థ సీఎం రేవంత్ అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక్క క్షణం కూడా సీఎంగా ఉండే అర్హత ఆయనకు లేదన్నారు. వెంటనే రాజీనామా చేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'మొదటి నుంచి బీఆర్ఎస్ చెప్తున్న మాటలు నేడు నిజమని తేలిపోయాయి. ఓనమాలు రాని వాడు పదో తరగతి చదివనట్లుంది రేవంత్ తీరు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ఢోకా లేదు. రేవంత్‌కి పరిపాలన చేతకావట్లేదనేది ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి. అప్పులతో ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ రెండున్నర లక్షల కోట్ల ఆదాయానికి తెచ్చారు. రాష్ట్ర ఆదాయం తగ్గి మంత్రుల ఆదాయం పెరగడంతోనే అసలు సమస్య వస్తోంది. మాఫియాలా రాష్ట్ర ఆదాయం లూటీ చేసి ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. సీఎం పదవికి లంచాల కోసం మంత్రులు పోటీ పడి సంపాదిస్తున్నారు. హామీలు ఎగ్గొట్టడం కోసమే రేవంత్ దొంగ ఏడుపులు ఏడుస్తున్నారు. నిన్న రేవంత్ మాట్లాడిన మాటల్లో ప్రతి అక్షరం అబద్ధమే. ఎన్నికల ముందు ప్రజలని రెచ్చగొట్టి హామీలిచ్చి నేడు చేతులెత్తేస్తున్నారు. మాది వందేళ్ళ చరిత్ర , అపార పరిపాలనా అనుభవం ఉందని కోసిన కోతలు ఏమయ్యాయి..? రేవంత్ రెడ్డిలా కేసీఆర్ బాధ్యతారాహిత్యమైన హామీలు ఇవ్వలేదు. ఆదాయ వ్యయాలు తెలుసు కాబట్టే కేసీఆర్ రేవంత్‌లా ఎక్కువిస్తామని చెప్పలేదు. అధికారం కోసం ప్రజలకు హామీలిచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నారు. తెలంగాణ తెచ్చిన వాళ్ళం కాబట్టే మోసపూరిత హామీలు మేము ఇవ్వలేదు. అప్పే అవసరంలేదన్న రేవంత్ ఇప్పుడు ఎందుకు కాళ్ళరిగేలా తిరుగుతున్నాడు. ఒక్క సంవత్సరం మంత్రులు కడుపుకట్టుకుంటే అన్ని హామీలు అమలయ్యేవి. రేవంత్ దొంగ చరిత్ర చూసి అందరు ఆయన్ని చెప్పులెత్తుకెళ్లే వాడిలా చూస్తున్నారు. తెలంగాణ పరువు బజార్లో పెడుతున్న రేవంత్.. 420 హామీలిచ్చామని చెంపలేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని జగదీష్ రెడ్డి అన్నారు.

## సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలు..



శ్రీనగర్: భారత్, పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతున్నది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైనికులు వరుసగా 12వ రోజూ కొనసాగాయి. జమ్ముకశ్మీర్‌లోని 8 సెక్టార్లలో సోమవారం రాత్రి కాల్పులకు తెగబడింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ, మెంధార్, నౌషెరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడింది. దీనికి భారత సైనికులు దీటుగా బదులిచ్చారు. ఏప్రిల్ 22న శ్రీనగర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత.. పాకిస్థాన్‌కు సింధూ జలాలను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పులకు తెగబడుతున్నది.

### ఉగ్రవాద స్థావరం గుట్టు రట్టు

జమ్ము కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా, సురాన్‌కోట్‌లో ఉగ్రవాద స్థావరాన్ని భద్రతా దళాలు, పోలీసులు గుర్తించారు. పహల్గాం ఉగ్రవాదుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు జరుపుతుండగా, ఉగ్రవాద స్థావరం బయటపడింది. టిఫిన్ బాక్సుల్లో మూడు, స్టీల్ బకెట్లలో రెండు ఐఈడీలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులను విలన్లుగా చిత్రీకరిస్తారా..?



హైదరాబాద్ : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ, డీఏలు అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలను ముందు విలన్లుగా చిత్రీకరిస్తారా..? అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని అడిగిన ఉద్యోగులపై రేవంత్ రెడ్డి నోరుపారేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ ఏ ఒక్క హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. తెలంగాణ కోసం వారు చేసిన త్యాగం గురించి రేవంత్ రెడ్డికి ఇసుమంతైనా తెలియదు. ఫ్రీ జోన్ హైదరాబాద్ అని తీర్పు వస్తే తెలంగాణ ఉద్యోగులు తిరస్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఎన్జీవోలు ఎంతో గొప్ప ఉద్యమం చేశారు అని కేటీఆర్ తెలిపారు.


### కేసీఆర్ 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు..

ఉద్యమంలో ఉద్యోగులు కదం తొక్కి రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే తెలంగాణ ఉద్యోగుల జీతాలు ఎక్కువ ఉండాలని చెప్పి కేసీఆర్ 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. ఒక స్పెషల్ ఇంక్రిమెంట్ కూడా ఇచ్చారు. ఎందుకంటే ఉద్యోగులే ఉద్యమకారులై కదం తొక్కారు కాబట్టి. పెన్ డౌన్ చేశారు. సకల జనుల సమ్మె చేసి తెలంగాణ కోసం కొట్లాడారు. కానీ ఇవాళ వారిని అవమానించారు. రాష్ట్ర ప్రజలతో వారికి చిచ్చు పెడుతున్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి.. కానీ మేం ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూశాం. ఉద్యోగ సంఘాల నాయకులకు కీలక పదవులు ఇచ్చాం. మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు అయ్యారు. అలా కేసీఆర్ ఉద్యోగులను గౌరవించారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

### మీరు చెప్పిన దాన్నే ఉద్యోగులు అడుగుతున్నరు..

ఇవాళ మీరు మేనిఫెస్టోలో చెప్పిన దాన్నే ఉద్యోగులు అడుగుతున్నరు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి రెండు పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లిస్తాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు తక్షణమే ఇస్తాం. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తెస్తాం. 317 రద్దు చేస్తాం. కొత్త పీఆర్సీ అమలు చేస్తామని చెప్పారు. ఇవాళ ఉద్యోగుల మీరు చెప్పిందే అడుగుతున్నరు.. గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. పీఆర్సీ, డీఏలు ఏవి అని అడుగుతున్నారు. కానీ మీరు ప్రజల ముందు ఉద్యోగులను విలన్లుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## ఆధారాలు లేని ఆరోపణలు అలవాటైపోయింది..



న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీరును సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా ఎండగట్టింది. ఆ సంస్థ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నదని, ఇదంతా ఓ మూస పద్ధతిలో జరుగుతున్నదని మండిపడింది. రుజువులు లేకుండా ఆరోపణలు చేయడం ఓ నమూనాను అనుసరిస్తున్నట్లుగా మారిందని దుయ్యబట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో మద్యం కుంభకోణం కేసులో నిందితుని బెయిలు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ ఏఎస్ ఓకా మాట్లాడుతూ, “మేం చాలా ఈడీ కేసులను పరిశీలించాం. ఇదొక మూస పద్ధతిగా, అసలుకు నకిలీని తయారు చేసినట్లుగా మారింది. సాక్ష్యాధారాలు లేకుండానే ఈడీ ఆరోపణలు చేస్తున్నది” అన్నారు. నిందితుడు నేరం చేసి రూ.40 కోట్లు సంపాదించినట్లు ఈడీ ఆరోపించిందని, ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఈడీ చెప్పలేకపోతున్నదని ఎద్దేవా చేశారు. ఏదైనా కంపెనీకి, నిందితునికి మధ్య ఉన్న సంబంధం ఏమిటో కూడా చెప్పలేకపోతున్నదని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు గత వారం కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. “దర్యాప్తు తనదైన వేగంతో జరుగుతూ ఉంటుంది. అది శాశ్వతంగా కొనసాగుతూనే ఉంటుంది. మూడు ఛార్జిషీట్లను దాఖలు చేశారు. ఆ వ్యక్తిని కస్టడీలో ఉంచుతూ మీరు వాస్తవంగా శిక్షిస్తున్నారు. ఈ ప్రక్రియను మీరు శిక్షగా మార్చేశారు. ఇదేదో ఉగ్రవాది లేదా ట్రిపుల్ మర్డర్ కేసు కాదు” అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో 2019-2022 మధ్య కాలంలో ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2,000 కోట్లు అవినీతి జరిగిందని ఈడీ ఆరోపించింది. ఆదాయపు పన్ను శాఖ నమోదు చేసిన కేసు నేపథ్యంలో ఈ మనీలాండరింగ్ కేసును ఈడీ నమోదు చేసింది. ఫిక్స్‌డ్ మార్కెట్ షేర్‌ను ఇచ్చినందుకు డిస్టిలరీల నుంచి లంచాలు తీసుకున్నారని ఆరోపించింది.

## గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు..

హైదరాబాద్: హైదరాబాద్ హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ సెంటర్ మినీ హాల్, ఫుడ్‌కోర్టులను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. గచ్చిబౌలి సర్వే నంబర్ 124, 127లోని సుమారు 20 ఎకరాల్లో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లేఅవుట్ వేసింది. ఇందులో 162 మంది ప్లాట్స్ కొనుగోలు చేశారు. సొసైటీ లేఅవుట్‌లో సంధ్యా కన్వెన్షన్ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని ప్లాట్లు కొనుగోలుచేసినవారు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. గతంలో వేసిన లేఅవుట్ నామరూపాలు లేకుండా రోడ్లు, పార్కును కలుపుతూ సంధ్యా కన్‌స్ట్రక్షన్ పలు ఆక్రమలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు అనుమతులు లేని కట్టడాలను తొలగించారు. %లేఅవుట్‌ను ఆక్రమించి నిర్మించిన రేకుల ఫెన్సింగ్, జీ ప్లస్ 2గా నిర్మించిన 3 ఐరన్ షెడ్‌లను, మినీ హాల్‌తోపాటు వంటగదులు, రెస్ట్ రూమ్‌లను నేలమట్టం చేశారు. ఇంకా పలు నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## సంపాదకీయం

బుధవారం 07-05-2025

# అధ్యక్షుడి ఎంపిక.. అంతర్మథనం

బీజేపీ అధ్యక్షుడి ఎంపికలో గతంలో ఆరెస్సెస్‌దే పెత్తనం సాగేది. అయితే, ఇదంతా 2014కు ముందు ముచ్చట. 2014, 2019 ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతు అవసరం లేకుండా బీజేపీని మోదీ సోలోగా ఎప్పుడైతే అధికారంలోకి తీసుకువచ్చారో అప్పట్నుంచి పరిస్థితి మారిపోయింది. కానీ, 2024లో సీన్ మళ్లీ రివర్స్ అయ్యింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ కంటే తక్కువగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో పార్టీ అధ్యక్షుడి ఎంపికలో మోదీ ప్రభావం నామమాత్రంగా మారడంతో.. తమ ఉనికిని చాటుకోవడానికి ఆరెస్సెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మరోవైపు తమకు నచ్చిన వ్యక్తిని అధ్యక్షుడిగా ప్రకటించాలని మోదీ-షా వర్గం పట్టుబడుతున్నది. వెరసి సంఘ్‌పరివార్ నేతలు, బీజేపీ నాయకుల మధ్య నెలకొన్న ఈ వివాదం కారణంగా బీజేపీ అధ్యక్షుడి ఎంపికలో తీవ్రమైన జాప్యం నెలకొన్నట్టు అర్థమవుతున్నది. బీజేపీ తర్వాతి అధ్యక్షుడు ఎవరన్న దానిపై ప్రస్తుతం సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఆరెస్సెస్, బీజేపీ నాయకుల మధ్య కుదిరే ఏకాభిప్రాయం ఆధారపడే కమలం అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందనేది గత అనుభవాలను బట్టి అర్థమవుతున్నది. అయితే, ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తున్నది. మార్చి 30న నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఆరెస్సెస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ మెమోరియల్‌ను ఆయన సందర్శించారు. అదే సమయంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌తో మోదీ భేటీ అయ్యారు. దీంతో అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఆరెస్సెస్-బీజేపీ మధ్య నెలకొన్న పొరపొచ్చాలకు ముగింపు పలకడంతో పాటు కొత్త అధ్యక్షుడి ఎంపిక త్వరలోనే జరుగుతుందని అందరూ భావించారు. అయితే, అలా జరగలేదు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్-భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో అధ్యక్షుడి ఎంపికకు మరింత సమయం పట్టేలా కనిపిస్తున్నది. 2020లో బీజేపీ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జగత్ ప్రకాశ్ నడ్డా ఇప్పటికీ ఆ పదవిలో కొనసాగుతున్నారు. బీజేపీలో సాధారణంగా 'వన్ మ్యాన్, వన్ పోస్ట్' అనే నిబంధన ఉంటుంది. అయితే, ఈ సూత్రానికి అతీతంగా నడ్డా అధ్యక్ష పదవితో పాటు ఆరోగ్య మంత్రిగా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా పలు పదవులను చేపట్టడం గమనార్హం. నిర్ణీత సమయంలో అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను చేపట్టడం ఆ పార్టీలో ఓ ఆనవాయితీగా, నియమంగా ఉండేది. అయితే, ఈసారి అది గాడి తప్పినట్టు తెలుస్తున్నది. గత చరిత్రను చూసుకుంటే, ఆరెస్సెస్ ఎంపిక చేసిన వ్యక్తినే బీజేపీ అధ్యక్షుడిగా నియమించడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే, గడిచిన పదేండ్లలో చూడని విధంగా నిరుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ కంటే తక్కువగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో అధ్యక్షుడి ఎంపికలో తన ఉనికిని చాటుకోవడానికి, బీజేపీ నియంత్రణను తగ్గించడానికి ఆరెస్సెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మరుసటి ఏడాది దక్షిణాది రాష్ర్టాలు కేరళ, తమిళనాడుతో పాటు పశ్చిమబెంగాల్‌లో, ఆ తర్వాతి ఏడాది సంఘ్ పరివార్‌కు అడ్డాలుగా పిలిచే యూపీ, గుజరాత్ అసెంబ్లీలకూ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో పార్టీ క్యాడర్‌పై పట్టున్న విశ్వాసపాత్రుడినే అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని ఆరెస్సెస్ భావిస్తున్నది. ఈ క్రమంలోనే 2024 ఆగస్టులో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నివాసంలో అత్యున్నత స్థాయి భేటీ జరిగింది. ఈ సమావేశంలో జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ అగ్రనేత దత్తాత్రేయ హోసబాలే, ఆరెస్సెస్ సంయుక్త కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సంస్థాగత నైపుణ్యాలు కలిగిన వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించాలని ఆరెస్సెస్ ప్రయత్నిస్తుండగా, మోదీ-షా ద్వయం మెప్పు పొందిన వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించాలని బీజేపీ పరివారం పట్టుబడుతున్నది. గడిచిన పదేండ్లలో బీజేపీ అధ్యక్షుడు పార్టీకి సంబంధించిన వ్యక్తిగా కంటే మోదీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యక్తిగా ఎక్కువగా పని చేసినట్టు ఆరెస్సెస్ భావిస్తున్నది. అయితే, ఇప్పుడు ఎంపిక చేసే వ్యక్తి ప్రభుత్వం నీడలో కాకుండా స్వతంత్రంగా పనిచేయాలని సంఘ్ పరివార్ కోరుకుంటున్నది. అడ్మినిస్ట్రేటివ్, ఆర్గనైజేషనల్ స్కిల్స్ కలిగిన సంఘ్ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ లేదా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ లేదా బీజేపీ ప్రధాన కార్యదర్శి సంజయ్ జోషిని బీజేపీ తర్వాతి అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని ఆరెస్సెస్ భావిస్తున్నది. అయితే, దీనికి భిన్నంగా.. కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్ లేదా భూపేంద్ర యాదవ్ లేదా ధర్మేంద్ర ప్రధాన్‌ను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టాలని బీజేపీ నాయకత్వం తలపోస్తున్నది. ఒకవేళ, దక్షిణాదికి అవకాశం ఇవ్వాలనుకుంటే.. తెలంగాణ నుంచి ఎవరో ఒకరికి లేదా మహిళకు అవకాశం కల్పించాలనుకుంటే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి పట్టం కట్టాలని బీజేపీ భావిస్తున్నది. కాగా యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ర్టాలకు బీజేపీ అధ్యక్షులను నియమించాల్సి ఉన్నది. ఈ క్రమంలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై ఆరెస్సెస్, బీజేపీ మధ్య చర్చలు త్వరలోనే కొలిక్కివచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

# రేవంత్.. ఢిల్లీ వెళ్లేది ఇందుకే! బీఆరెస్ నేతలకు.. ఇవి కనపడటం లేదా?



హైదరాబాద్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకు వెళుతుంటారు! అలా వెళ్లినప్పుడే కేంద్ర ప్రభుత్వ ముఖ్యులను కలుసుకొని సమావేశమవుతున్నారు! ఫ్లైవోవర్లకు అవసరమైన మిలిటరీ భూముల్లో అనుమతులు సాధించగలుగుతున్నారు. నావీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు కేంద్రాన్ని ఒప్పించగలిగారు! బీఆరెస్ హయాంలో ఊసులేకుండా పోయిన రీజినల్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటును పట్టాలెక్కిస్తున్నారు! కానీ.. పాజిటివ్ పనులు చూడటానికి ఇష్టపడకుండా.. ప్రతిదానినీ నెగెటివ్ కోణంలోనే చూడటం అలవాటైన బీఆరెస్ నేతలు మాత్రం.. రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లారో లెక్కగట్టి.. తమ సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ పెట్టించుకుంటూ వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పదేళ్ల పాలన ప్రజాస్వామ్యయుతమేనా?

రాష్ట్రంలో బీఆరెస్ పదేళ్లు అధికారం చెలాయించింది. ఆ సమయంలో ప్రజాస్వామ్యయుతంగానే పరిపాలించారా? అనేది బేరీజు వేసుకోకుండా.. ఇప్పుడు పాలనపై తరచూ నోరు జారుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజమే! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలకు వెళుతున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, పెండిగ్‌లో ఉన్న పనులకు మోక్షం కల్పించేందుకు ఈ పర్యటనల సందర్భంగా సీఎం కృషి చేస్తున్న విషయాన్ని గుర్తించేందుకు బీఆరెస్ నేతలు నిరాకరిస్తున్నట్టు కనిపిస్తున్నదని పలువురు పరిశీలకులు అంటున్నారు. ఈ పర్యటనల సందర్భంగా ప్రధాన మంత్రి, రక్షణ మంత్రి, హోం మంత్రితోపాటు.. ఇతర శాఖల మంత్రులనూ ఆయన కలుస్తున్నారని వారు గుర్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో రహదారుల విస్తరణకు, ఫ్లైవోవర్ల నిర్మాణానికి పలు చోట్ల మిలిటరీ ఆస్తులు అడ్డంకిగా ఉన్నాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే కేంద్రాన్ని ఒప్పించగలగుతున్నారు. వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయించారు. తెలంగాణలో ప్రాంతీయ విమానాశ్రయాలకు మార్గం సుగమం చేశారు. ఇవన్నీ చేయిస్తూనే ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ సంఘాలు, నాయకులను కలుస్తున్నారని, అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారని అంటున్నారు. ఇవన్నీ ప్రధాన ప్రతిపక్షానికి పట్టకపోవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

### ఫామ్‌హౌస్ ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తరువాత కేసీఆర్ రెండుసార్లు సీఎంగా పనిచేశారు. తనవల్లే తెలంగాణ సాకారం అయిందనే స్వీయ నమ్మకం నిలువెల్లా నిండిపోయి.. ప్రజాభిప్రాయాలను, మేధావుల ఆలోచనలను, ప్రజా ప్రతినిధుల సలహాలను చెత్తబుట్టపాలు చేశారనే విమర్శలు మొదటి నుంచీ ఉన్నాయి. లక్ష కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం.. తెల్ల ఏనుగుగా మారిపోయింది. సుమారు రూ.1,500 కోట్లతో నిర్మించిన ఇరుకైన సచివాలయానికి ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ డజన్‌సార్లకు మించి రాలేదు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బాయికాడ కూర్చొనే పాలనను పర్యవేక్షించారని, అక్కడ వీలు కాకపోతే శత్రు దుర్భేధ్యంగా బేగంపేటలో నిర్మించుకున్న ప్రగతి భవన్ (నేటి మహాత్మా జ్యోతిరావు ఫూలే భవనం)లో సుదీర్ఘంగా సమీక్షలు నిర్వహించేవారని పలువురు రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఆర్థిక మంత్రి లేకుండానే ఆర్థిక శాఖపై రివ్యూ జరిగిపోయేది! ఆరోగ్యశాఖ మంత్రి లేకుండానే.. ఆరోగ్యరంగంపై సమీక్షలు ముగిసేవి! తాను అనుమతించి, తన ఆఫీసులో వారితో ముచ్చటపెట్టి.. అది ఏ రంగానికి సంబంధించినది అయితే.. ఆ అంశంపై సీఎం సమీక్షించినట్టు ప్రెస్‌నోట్‌లు వచ్చేవని అప్పట్లో సీఎంవో బీట్ చూసిన ఒక సీనియర్ జర్నలిస్టు ప్రస్తావించారు. అనుమతి లేకుండా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యేలే కాదు.. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి కూడా ప్రవేశం లభించేది కాదని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మంత్రులు చాలా సందర్భాల్లో వెనుదిరిగి పోయిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. కొందరు మంత్రులైతే 'లోపలికి పంపితే, కాసేపటికే వెనక్కి వస్తాం.. లేదంటే కార్యకర్తల ముందు ఇజ్జత్ పోతుంది' అంటూ సెక్యూరిటీతో మొత్తుకున్న ఘటనలు కోకొల్లలని ఆయన చెప్పారు.

### పోలోగ్రౌండ్ కేటాయించలేదని.. రాడార్ స్టేషన్‌కు మోకాలడ్డు

సికింద్రాబాద్ పోలో గ్రౌండ్‌లో సచివాలయం నిర్మించాలని మొదట్లో కేసీఆర్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే.. కేంద్రం ఆ భూమి కేటాయించలేదని మనసులో పెట్టుకున్న కేసీఆర్, వికారాబాద్‌లో నేవీ రాడార్ స్టేషన్‌కు భూములు కేటాయించకుండా వదిలేశారని పలువురు సీనియర్ అధికారులు చెబుతున్నారు. కేంద్రం ఎన్నిసార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదని అన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు డబుల్ డెక్కర్ రైలు బ్రిడ్జీలను నిర్మించుకునేందుకు సహకరిస్తామని, ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ కోరినా పెడచెవిన పెట్టారని ఒక అధికారి తెలిపారు.

### అవసరానికే తెరుచుకున్న గేట్లు

మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు ప్రగతి భవన్ గేట్లు తెరిచిన కేసీఆర్, ఎన్నికలు పూర్తయి, అవసరం తీరగానే గేట్లు మూసి వేయించారనే విమర్శలు ఉన్నాయి. ఈ అవమానాన్ని కమ్యూనిస్టు నాయకులు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోయారు. తెలంగాణ ప్రజలు, పాలకులకు గుండెకాయ లాంటి సచివాలయం నిర్మాణం పై ఏ ఒక్కరి సలహా, సూచనలు తీసుకోకుండా ఏకపక్షంగా నిర్మాణం చేయించారనే విమర్శలు ఉన్నాయి. రూ.1,500 కోట్లు వెచ్చించి సచివాలయం నిర్మించినా.. అందులో అరకొర వసతులే ఉండటంతో రాజభవనంలా కట్టిన ఆ కట్టడం ఇరుకుగా మారిందని సచివాలయ వర్గాలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. 'వాహనాల పార్కింగ్ కోసం అనువై స్థలమే లేదు. ఉద్యోగులు పనిచేసుకునేందుకు అనువైన వాతావరణం లేదు. తన లక్కీ నెంబర్ 6 కలిసి వచ్చేలా ఆరంతస్తుల సచివాలయం ఇరుకుగా, నాసిరకంగా నిర్మాణం చేయించారు' అని సచివాలయ ఉద్యోగి ఒకరు అన్నారు.

### ప్రొటోకాల్‌లోనూ ఆధిపత్య ధోరణి

రాష్ట్రానికి ప్రధాని వచ్చినా, కేంద్ర మంత్రులు వచ్చినా విమానాశ్రయానికి వెళ్లి ఆహ్వానించకుండా నగర మంత్రులను పంపించడం వారిని అవమానించడం కిందకే వస్తుందని ఒక సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. 'ప్రధాన మంత్రి, హోం మంత్రిపై ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేసి, ఫెడరల్ ఫ్రంట్ అంటూ ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చేవారు. ప్రధాని హైదరాబాద్ వచ్చిన సమయంలో నల్ల జెండాలు, బెలూన్లను ఎగురవేయించడం, హోర్డింగ్‌లు పెట్టించి అవమాన పర్చడం సంప్రదాయంగా చేసుకున్నారు' అని ఆయన గుర్తు చేశారు.

### ప్రజలను కలుస్తున్న రేవంత్.. కేంద్రంతోనూ పనులు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డి తన మార్క్ పరిపాలన చేస్తున్నారనే అభిప్రాయం సీనియర్ ఐఏఎస్‌లలో వ్యక్తమవుతున్నది. 'జిల్లాల పర్యటనలు చేస్తూ బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు అప్పాయింట్‌మెంట్‌లు ఇస్తున్నారు. ముఖ్యమైన సందర్భాలలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో భేటీ అవుతున్నారు. సచివాలయానికి రాకపోయినా తన ఇంటి వద్ద పలువురితో మాట్లాడుతున్నారు. బంజారాహిల్స్ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల అధిపతులతో సమావేశమై ఆదేశాలు జారీ చేస్తున్నారు. సచివాలయం, అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్, సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుత పాలన అందిస్తుందని, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని స్పష్టంగా చెప్పడమే కాదు.. ఆచరణలోనూ చూపుతున్నారు' అని ఆయన చెప్పారు.

### జాతీయ పార్టీ నేతలను కలవొద్దా?


రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు 42 సార్లు పైగా ఢిల్లీ వెళ్లి వచ్చారు. కొన్ని సందర్భాల్లో ఒకటి రెండు రోజులు ఉంటే, మరికొన్ని సందర్భాల్లో మూడు నాలుగు రోజులు ఉండి పార్టీ పనులతోపాటు.. కేంద్రంలో పెండింగ్ పనులు చక్కదిద్దుకుంటున్నారని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. పనిలో పనిగా ప్రధాన మంత్రి, హోం మంత్రి, రక్షణ మంత్రి తో పాటు ఇతర మంత్రులను కలిసి రాష్ట్రానికి కావాల్సిన పనులకు ఆమోద ముద్ర వేయించుకుని వస్తున్నారని చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ కావడంతో ఢిల్లీలో పెద్దలు ఉండరు. విశేషం ఏమిటంటే.. తమకు ఢిల్లీలో పెద్దలు లేరని, తాము ప్రజల సేవలకులమని చెప్పుకొన్న కేసీఆర్.. కనీసం ఆ ప్రజలను కూడా కలిసింది లేదని పలువురు పరిశీలకులు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం కదా ప్రజలను కలవాల్సిన అవసరం ఏంటని పలుమార్లు అప్పటి మునిసిపల్ మంత్రి కేటీఆర్ స్వయంగా వ్యాఖ్యానించారంటే.. వారి ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. దీనికి భిన్నంగా.. రాష్ట్రానికి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ఇతర మంత్రులు వచ్చిన సందర్భాల్లో ప్రొటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలను రేవంత్‌రెడ్డి ఇస్తున్నారని చెబుతున్నారు. బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా వ్యతిరేకంగా ఉంటే విమర్శలు చేస్తున్నామని, అలాగని కక్షపూరితంగా ప్రవర్తించడం లేదని రేవంత్ రెడ్డి పలు సందర్భాలలో ప్రకటించారు. పార్టీ పనులతో పాటు కేంద్రం పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్తున్నానని, స్వంత పనులు చక్కదిద్దుకోవడానికి కాదని రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షం నేతకు చురకలంటించారు కూడా. హైదరాబాద్ మహా నగరంలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం మిలిటరీ భూములు అడ్డంకిగా ఉన్నాయి. వీటికి ఆమోద ముద్ర వేయించి, మార్గం సుగమం చేయడంతో సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి ఫ్లైఓవర్ ను నిర్మించనున్నారు. వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ కు భూములు, స్థానిక అనుమతులు ఇవ్వడంతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం సై అనడంతో, వరంగల్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం రాబోతున్నది. ఇలా కేంద్రంలో పెండింగ్ లో ఉన్న పనుల పరిష్కారం కోసం రాష్ట్ర ఎంపీలతో కలిసి వెళ్తున్నా అయినా విమర్శలు గుప్పిస్తునే ఉన్నారు.

# పాక్ వద్ద అడుగంటిన ఫిరంగి గుండ్లు

న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ దాడికి దిగితే తగిన రీతిలో జవాబిస్తామంటూ ఒక పక్క పాకిస్థాన్ మంత్రులు, ఆర్మీ నివేదిక మేకపోతు గాంభీర్యం కనిపించేలా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆ కీలక దేశమైన ఫిరంగి మందుగుండు సామగ్రి కొరతతో ఇబ్బంది పడుతున్నది. యుద్ధమంటూ మొదలై నాలుగు రోజుల్లో శతఘ్ని గుండ్లు ఖాళీ అవని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ గుర్తించింది. ఇటీవలి కాలంలో ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు జరిగిన నేపథ్యంలో ముందస్తు ఒప్పందాల మేరకు పాకిస్థాన్ తన దగ్గర ఉన్న ఆయుధ సామగ్రిలో చాలామటుకు ఈ దేశాలకు ఎగుమతి చేయడంతో నిల్వలు తరిగిపోయాయి. తీరా ఇప్పుడు యుద్ధ వాతావరణం ఉండే సొంతానికి వినియోగించుకునేందుకు ఫిరంగి మందుగుండు సామగ్రికి తీవ్ర కొరత ఏర్పడింది.

### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ఆపసోపాలు

సైన్యానికి ఆయుధాలను సరఫరా చేసే పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కాలం చెల్లిన ఉత్పత్తి సౌకర్యాల మధ్య పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఆయుధ సామగ్రిని తయారు చేస్తారు. చేయడానికి ఆపసోపాలు పడుతున్నాయి. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి చేయడానికి చాలాకాలం పడుతుందని అవి కనిపిస్తున్నాయి. 'హఠాత్తుగా ఇప్పుడు భారత్‌తో యుద్ధం ప్రారంభమైతే తమ వద్ద ఉన్న మందుగుండు సామగ్రి నిల్వలు కేవలం 96 గంటలకు సరిపోతాయి' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. భారత సైనిక చర్యను ఎదుర్కోవడానికి పాకిస్థాన్ సైన్యం వద్ద ఎం109 హోవిట్జర్‌లకు తగినంత 155 ఎంఎంలు, లేదా బీఎం 21 వ్యవస్థలకు 122 ఎంఎం రాకెట్లు లేవు. 155 ఎంఎం ఆర్టిలరీ ష్లాస్ ఉక్రెయిన్‌కు విక్రయించడంతో ఇప్పుడు వాటి నిల్వలు చాలా స్వల్పంగా ఉన్నాయని



ఏప్రిల్‌లో చేసిన పలు ఎక్స్ పోస్టుల ద్వారా వెల్లడైంది. ప్రస్తుతం భారత్‌తో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడితే భారత్ దాడి చేయడం ఎలా అని పాకిస్థాన్ రక్షణ శాఖను పరిశీలిస్తుంది చేస్తున్నారు. ఇదే పరిశీలన మే 2న జరిగిన స్పెషల్ కార్ప్స్ కమాండర్ల సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఒక వేళ భారత్‌తో యుద్ధం వచ్చి అది దీర్ఘకాలం కొనసాగితే ఒక పక్క మందుగుండు సామగ్రి కొరత, మరోపక్క తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ చాలా చిక్కులు ఎదుర్కోక తప్పదని పాకిస్థాన్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ జావ్ బజ్వా అభిప్రాయపడ్డారు.

### యుద్ధం వస్తే ఇంగ్లండ్‌కు పారిపోత

భారత్‌తో యుద్ధం మొదలైతే ఏం చేస్తారు అని ప్రశ్నిస్తే.. 'ఏం చేస్తాం.. ఇంగ్లండ్ పారిపోతా' అంటూ పాకిస్థాన్ ఎంపీ షేర్ అఫ్జల్ ఖాన్ మర్వత్ చెప్పారు. సమాధానం ఇప్పుడు వైరల్‌గా మారింది.

# కౌలు రైతుల వరం అన్నదాత సుఖీభవ పథకం

అమరావతి, అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఎపి లోని కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. కౌలు రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే ఈ పథకం ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దీనిని అమలు చేయబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.. ఇప్పటికే పలు హామీలను అమలు చేస్తుండగా.. మే నెలలో మరో రెండు పథకాలను నెరవేర్చేందుకు సిద్ధమైంది. వీటిలో ముఖ్యమైనది అన్నదాత సుఖీభవ పథకం. దీనికింద ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున సాయం అందజేయనుంది. ఈ పథకాన్ని సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం అందించే రూ.20 వేలను.. మూడు విడతల్లో ఇస్తారు. ఈ రూ. 20 వేలల్లో పిఎం కిసాన్ పథకం కింద వచ్చే పథకం కింద ఇచ్చే రూ.6 వేలు కూడా కలుపుతారు. అటవీ భూములపై హక్కులు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకానికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. పూర్తి వివరాలు సేకరించిన తరవాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సిద్దగా ఉన్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి వ్యవసాయశాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా ఇప్పటికే మరణించిన లబ్ధిదారుల పేర్లను తొలగించడం, భూ రికార్డులకు అనుగుణంగా లబ్ధిదారుల నమోదు, రైతుల ఐడీ నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఈకేవైసీ వివరాల సవరణ వంటి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన గిరిజనులకు, అలాగే ప్రత్యేకంగా గుర్తించబడిన అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన అర్హుల ఎంపిక కోసం గిరిజన శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. ప్రస్తుత, మాజీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, మంత్రులు, శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు వంటి రాజ్యాంగ బద్ధ పదవులను నిర్వహిస్తున్నవారు, నిర్వహించినవారు అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు, శాఖల కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థలలో, స్థానిక సంస్థలలో శాశ్వత ఉద్యోగంగా పని చేస్తున్నవారు కూడా ఈ పథకం కింద సాయం పొందడానికి అనర్హులు. అలాగే నెలకు రూ.10 వేలు లేదా అంతకన్నా ఎక్కువ పెన్షన్ తీసుకునే వారికి కూడా పథకం వర్తించదు. అయితే, మల్టీటాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4, గ్రూప్-డి ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఉంది. వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఛార్టెడ్ అకౌంటెంట్లు-, ఆర్కిటెక్టులు, అలాగే ఇతర నమోదిత వృత్తి నిపుణులకూ ఈ పథకం వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ప్రధానంగా కౌలు రైతులకు మేలు చేసేలా దీనిని రూపొందించారు.

# సంచలనం!ఒక అద్భుతం

విజయవాడ:, నిన్నో నిశ్శబ్ద అంకురార్పణ ఆంధ్రాలో జరిగింది. ఇది అమరావతి గురించి కాదు. కానీ అదిప్పుడు అంతర్జాతీయ మీడియా మరియు మ్యాగజైన్ల ముఖ్యాంశాలుగా మారాయి. స్టాక్ మార్కెట్లలో సదరు స్టాక్స్ ను కూడా ప్రభావితం చేసింది

### "క్వాంటం కల సాకారమవుతోందా?

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం!ఒక ఊహ ఒక అద్భుతం ఒక సరికొత్త సాంకేతిక విప్లవం! మన కళ్ల ముందే ఆవిష్కృతం కాబోతోంది. విశ్వంలోని అత్యంత సంక్లిష్టమైన రహస్యాలను ఛేదించే శక్తి మన ముంగిట నిలవబోతోంది. అదే క్వాంటం కంప్యూటింగ్! ఇది కేవలం ఒక సాంకేతికత కాదు ఇది భవిష్యత్తును మార్చేసే ఒక శక్తి!రియాక్షన్స్ అన్లీష్డ్ :టెక్ ప్రపంచం సంభ్రమాశ్చర్యా లు: ఈ ప్రకటన వెలువడగానే ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాయి. స్టాక్ మార్కెట్‌లో ఉత్సాహం: ఈ ప్రకటన వెలువడిన వెంటనే స్టాక్ మార్కెట్‌లో %×దీవీ% మరియు TCS షేర్లు స్వల్పంగా పెరిగాయి. ఇన్వెస్టర్లు ఈ దీర్ఘకాలిక పెట్టుబడిని ఒక సువర్ణావకాశంగా భావిస్తున్నారు. క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తులో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందనే నమ్మకంతో కొనుగోళ్లు పెరిగాయి. సోషల్ మీడియాలో టెక్కీల కేరింతలు: సోషల్ మీడియాలో ఈ వార్త ఒక తుఫానులా వ్యాపించింది. క్వాంటం ఆంధ్రప్రదేశ్ అంటూ తమ ఆనందాన్ని, గర్వాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, యువత ఈ పరిణామాన్ని తమ భవిష్యత్తుకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నారు. ప్రపంచంలోని మూడు దిగ్గజ టెక్నాలజీ మరియు ఇంజనీరింగ్ సంస్థలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మరియు లార్సెన్ & టూబ్రో -% మన రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి! ఈ ప్రకటన మొన్న చంద్రబాబు సమక్షంలోనే వెలువడింది. ఇది కలకాదు. అవును మీరు వింటున్నది నిజమే! టీసీఎస్, ఐబీఎంలు కూడా వారి కంపెనీల వెబ్సైట్లలో పెట్టారు. అమరావతిలో రూపుదిద్దుకోబోతోంది భారతదేశపు మొట్టమొదటి క్వాంటం వ్యాలీ టెక్ పార్క్! ఇది కేవలం ఒక భవనం కాదుది భవిష్యత్తు తరాల పరిశోధనలకు, ఆవిష్కరణలకు ఒక వ్యాలీ కాబోతోంది!ఈ టెక్ పార్క్‌ను జనవరి 1, 2026న దేశానికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరి ఇందులో కొలువుదీరబోయే ఆ అద్భుత యంత్రం ఏమిటో తెలుసా? %×దీవీ% యొక్క సరికొత్త సృష్టి %- ×దీవీ% క్వాంటం సిస్టమ్ టూ! ఏకంగా 156 క్యూబిట్ల హెరాన్ క్వాంటం ప్రాసెసర్‌తో ఇది భారతదేశపు సాంకేతిక చరిత్రలో ఒక సంచలనం సృష్టించబోతోంది! సామాన్య కంప్యూటర్లు తలమునకలయ్యే లెక్కలను ఇది క్షణాల్లో పూర్తి చేయగలదు!క్లిష్టమైన సమస్యలకు క్వాంటం పరిష్కారాలను కనుగొనడంలో, వైద్యం నుండి తయారీ వరకు వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో TCS తన మేధోశక్తిని ఉపయోగించనుంది. అంతేకాదు, ఈ టెక్ పార్క్‌లోని శాస్త్రవేత్తలకు IBM యొక్క శక్తివంతమైన క్లౌడ్ క్వాంటం కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకురానుంది!ఈ టెక్ పార్క్ యొక్క మౌలిక సదుపాయాల అభివృద్ధిని L&T పర్యవేక్షిస్తుంది, తద్వారా అత్యాధునిక సాంకేతికతకు అనుగుణంగా అన్ని హంగులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ క్వాంటం కలను నిజం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తోంది. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ టెక్ పార్కును ప్రపంచ పటంలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెట్టాలనే దృఢ సంకల్పంతో ఉంది. దీని ద్వారా వేలాది అత్యాధునిక ఉద్యోగాలు సృష్టించబడతాయి, ప్రపంచ నలుమూలల నుండి మేధావులు ఇక్కడకు తరలివస్తారు, భారీగా పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. GST నిర్వహణ నుండి ఖచ్చితమైన జనాభా లెక్కల విశ్లేషణ వరకు, ప్రతి రంగంలోనూ క్వాంటం టెక్నాలజీ ఒక కొత్త శకానికి నాంది పలుకుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది!ఆంధ్రప్రదేశ్ ఇక కేవలం ఒక రాష్ట్రం కాదు ఇది క్వాంటం విప్లవానికి కేంద్రం కాబోతోంది! జనవరి 1, 2026 కోసం ఎదురుచూద్దాం చరిత్ర సృష్టించబడబోతోంది!ఇలాగే ఓ రోజు సైలెంట్‌గా నాయుడు పాతికేళ్ల క్రితం హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ అంటే నవ్వుకొన్నారు. కట్ చేస్తే కరోనా సమయంలో ఆ వ్యాలీలోని భారత్ బయోటెక్ వ్యాక్సిన్ కోసం ప్రపంచమే పడిగాపులు గాస్తూ ఎగబడి కొని వేయించుకొంది. అమరావతి కూడా క్వాటం వ్యాలీగా మారితీరుతుంది. మారే వరకు నాయుడు వదిలిపెట్టరు.

# ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య

సంగారెడ్డి, క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కోలుకుంటున్న శ్రీతేజ్...

హైదరాబాద్, పుష్ప -2 రిలీజ్ రోజున సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ను అ÷-ల్లు అరవింద్ పరామర్శించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం శ్రీతేజ్ కొద్దీ రోజుల క్రితం ఆసుపత్రి నుండి డిశార్చి అయ్యాడు. అయితే శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేందుకు మరి కొన్ని నెలలు పడుతుందని డాక్టర్లు వెల్లడించారు. అదే సమయంలో శ్రీతేజ్ ను రీహాబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. ఈక్రమంలో సోమవారం శ్రీతేజ్ ను అల్లు అరవింద్ పరామర్శించారు. పునరావస కేంద్రానికి వెళ్లి డాక్టర్లను కలిసి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'శ్రీ తేజ్ కోలుకోవటం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది. శ్రీతేజ్ రోజురోజుకు కోలుకుంటున్న విషయం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. శ్రీ తేజ్ చికిత్సకు సహకరిస్తున్నారు అని చెప్పారు డాక్టర్లు. ఇప్పటికే రూ. 2 కోట్లు- శ్రీతేజ్ అకౌంట్ లో డిపాజిట్ చేసాడు అల్లు అర్జున్. త్వరలోనే శ్రీ తేజ్ మనందరి మధ్య సాధారణల పిల్లల్లా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.

## గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ..

వేములవాడ,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్ గా మారింది. గల్ఫ్ లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు.

# భారత్ ఆర్మీ సరికొత్త ప్లాన్.. పాక్ ఖేల్ ఖతం...




న్యూఢిల్లీ,విలేజ్ డిఫెన్స్ గార్డ్స్. వినడానికి కొత్తగా ఉన్నా.. విషయం చాలా ఉంది. పహల్గామ్ టెర్రర్ ఎటాక్ తర్వాత.. కశ్మీర్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయ్. సరిహద్దు జిల్లాల్లో ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనే అనుమానాలున్నాయ్. దాంతో.. ఇండియన్ ఆర్మీ ఓ కొత్త ప్లాన్ వేసింది. భారత సరిహద్దుల అవతలి నుంచి వచ్చే ఎలాంటి శత్రువైనా సరే.. ఆ సరిహద్దుల్లోనే ఖతమయ్యేలా మన ఆర్మీ పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. అసలు.. జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో ఇండియన్ ఆర్మీ ఏం చేస్తోంది? విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ ఎవరు? వాళ్లకెందుకు ట్రైనింగ్ ఇస్తున్నారు?

### కశ్మీర్ బోర్డర్‌లో.. ప్రతి పౌరుడు సైనికుడే!

భారత శత్రువులెవరైనా సరే.. మన బోర్డర్ దాటాలంటే ఇకపై ఒకటికి పదిసార్లు ఆలోచించాలి. మన సరిహద్దుల అవతలి నుంచి వచ్చే ఏ శత్రువైనా సరే.. ఆ సరిహద్దుల్లోనే ఖతమయ్యేలా ఇండియన్ ఆర్మీ పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. ఇందుకోసం.. భారత బలగాలు సరికొత్త ప్లాన్ వేశాయి. తీవ్రవాదుల్ని ఎదుర్కొనేందుకు.. బోర్డర్ దగ్గర్లో ఉన్న గ్రామస్తులకు ట్రైనింగ్ ఇచ్చి మరీ తుపాకులు అందిస్తోంది.

### కిష్త్వార్, దోడా, ఉధమ్ పూర్ జిల్లాల్లో ఉగ్ర కదలికలు

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సరిహద్దుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. దాంతో.. జమ్ముకశ్మీర్‌లోని కిష్త్వార్, దోడా, రాజౌరి, పూంచ్ లాంటి జిల్లాల్లో.. భద్రత దృష్ట్యా.. విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌కు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు పోలీసులు. ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడులతో.. ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విలేజ్ డిఫెన్స్ గార్డ్స్.. తమ ఆయుధాలను సమర్థవంతంగా ఉపయోగించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు.. ఈ ట్రైనింగ్ ఎంతో కీలకమని పోలీసు అధికారులు చెబుతున్నారు. కొన్ని వారాలుగా.. కిష్త్వార్, దోడా, ఉధమ్‌పూర్ జిల్లాల్లో టెర్రరిస్టుల యాక్టివిటీ పెరిగింది.

### ఆర్మీ, కశ్మీర్ పోలీసుల సీఆర్‌పీఎఫ్ బృందాల ట్రైనింగ్

గత నెలలో కిష్త్వార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు, ఇంకొందరు టెర్రరిస్టులు తప్పించుకొని.. దట్టమైన అడవుల్లో తలదాచుకున్నట్లు అనుమానిస్తున్నారు. దాంతో.. ఈ శిక్షణా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ట్రైనింగ్ తీసుకుంటున్న ఈ విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌ని.. సరిహద్దులకు దగ్గర్లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను కాపాడేందుకు, ఉగ్రవాదుల నుంచి స్థానికులను రక్షించేందుకు ఏర్పాటు చేశారు. వీరికి.. పోలీసులు, సైన్యమే.. ఆయుధాలతో పాటు శిక్షణ కూడా ఇస్తాయి. ఈ ఆపరేషన్లలో.. ఇండియన్ ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. డ్రోన్లు, హెలికాప్టర్ల సాయంతో ఉగ్రవాదుల కదలికలను గమనిస్తున్నారు.

### విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌కి రైఫిళ్లు, ఆటోమేటిక్ గన్స్, వాడకంపై ట్రైనింగ్

విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌కి ప్రధానంగా రైఫిళ్లు, ఆటోమేటిక్ ఆయుధాలను సమర్థవంతంగా ఎలా ఉపయోగించాలనే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. ఉగ్రవాద దాడుల సమయంలో.. రక్షణాత్మకంగా ఉండటంతో పాటు, వారిపై ఏవిధంగా దాడి చేయాలనే దానికి సంబంధించిన వ్యూహాలను అమలు చేసే పద్ధతుల్ని కూడా నేర్పిస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు, ఆకస్మిక దాడుల సమయంలో వెంటనే స్పందించడం, అందరితో సమన్వయం చేసుకోవడం ఎలా అనేది కూడా చెబుతున్నారు.

### డ్రోన్ టెక్నాలజీ, ఆధునిక టెక్నిక్‌లపైనా విలేజ్ గార్డ్స్‌కి శిక్షణ

బోర్డర్ దగ్గరలో అనుమానాస్పద కదలికలను గుర్తించి.. పోలీసులకు, సైన్యానికి సమాచారం అందించడంపైనా శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా.. గ్రామీణ, కొండ ప్రాంతాల్లో శారీరకంగా చురుగ్గా ఉండేందుకు ఫిట్‌నెట్ ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ సెషన్ అంతా.. గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక పోలీస్ స్టేషన్లు, సైనిక శిబిరాల్లో సాగుతున్నాయి. కొన్నిసార్లు.. డ్రోన్ టెక్నాలజీ, రాత్రి పూట గస్తీ లాంటి ఆధునిక టెక్నిక్‌లపైనా శిక్షణ ఇస్తున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కలిసి.. విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌కి ట్రైనింగ్ సెషన్స్‌ని నిర్వహిస్తున్నాయి.

### గ్రామీణ ప్రాంతాల్లో భద్రత పటిష్టంచేసే చర్యలు

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత.. జమ్మూకశ్మీర్‌లో భద్రతా చర్యలు మరింత కఠినతరమయ్యాయ్. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను పటిష్టం చేసేందుకు.. ఈ గ్రామ రక్షణ బృందాలను సన్నద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ విలేజ్ డిఫెన్స్ గార్డులకు శిక్షణని తప్పనిసరి చేయడం ద్వారా.. సరిహద్దుల్లో భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఉగ్రవాద బెదిరింపులను ఎదుర్కొనేందుకు.. ప్రభుత్వం, సైన్యం, పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలు.. సరిహద్దు గ్రామాల్లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో కీలకపాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నారు.

### ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించేందుకు యాక్షన్ ప్లాన్

మరోవైపు.. జమ్మూకశ్మీర్ పోలీసులు, సైన్యం కలిసి ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించేందుకు యాక్షన్ ప్లాన్‌ని వేగవంతం చేశాయి. కిష్త్వార్‌లోని దట్టమైన అడవుల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌తో పాటు స్థానికులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. అనుమానాస్పద కదలికలను గమనిస్తే.. వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడంలో సహాయపడతాయని అధికారులు భావిస్తున్నారు.

### రెండేళ్ల క్రితమే ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది ప్రభుత్వం

విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ చేతికి తుపాకులిస్తున్నారు.. శత్రువు కనిపిస్తే కాల్చిపారేసేలా ట్రైనింగ్ ఇస్తున్నారు. ఫుల్ ఫిట్‌నెస్‌తో ఉండి.. సరిహద్దు గ్రామాల రక్షణ బాధ్యతల్ని వాళ్లకు అప్పజెబుతున్నారు. ఇదంతా ఇప్పుడు కొత్తగా అనిపిస్తున్నా.. రెండేళ్ల క్రితమే ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది ప్రభుత్వం. ఇప్పుడు బోర్డర్‌లో నెలకొన్న ఉద్రిక్తతలతో.. పూర్తిస్థాయిలో అలర్ట్ చేశారు. దాంతో.. తీవ్రవాదుల్ని ఎదుర్కొనేందుకు విలేజ్ గార్డ్స్‌కి ట్రైనింగ్ ముమ్మరం చేశారు.

### కిష్త్వార్, దోడా, పహల్గామ్ ఉగ్రవాద కార్యకలాపాలు

పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రదాడి జరగడానికి ముందే.. కిష్త్వార్, దోడా, పహల్గామ్ లాంటి ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయి. ఈ దాడులు.. సరిహద్దులకు సమీపంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో భద్రతా లోటును ఎత్తి చూపాయి, దాంతో.. విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ సామర్థ్యాన్ని పెంచేందుకు శిక్షణ తప్పనిసరైంది. ముఖ్యంగా.. కిష్త్వార్, దోడా లాంటి కొండ ప్రాంతాల్లో పోలీసు, సైనిక బలగాలు నిరంతరం గస్తీ తిరగడం కష్టం. అందువల్ల.. స్థానిక గ్రామస్తులతో ఏర్పాటు చేసిన ఈ విలేజ్ డిఫెన్స్ గార్డులే.. తమ గ్రామాలను రక్షించుకోవడంలో కీలకంగా పనిచేస్తారు.

### గ్రామస్థులకు ఆత్మరక్షణని ఇచ్చే వీడీజీ గ్రూపులు

ఈ విలేజ్ గార్డ్స్.. ఉగ్రవాదుల దాడులను అడ్డుకోవడంతో పాటు, స్థానిక సమాచారాన్ని సేకరించి అధికారులకు అందిస్తారు. వీరిలో స్థానిక యువత, మాజీ సైనికులు, స్థానిక పోలీసు సిబ్బంది ఉంటారు. వీరికి శిక్షణ ఇవ్వడం వల్ల.. స్థానికంగా ఉన్న ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమాజం ఐక్యంగా నిలబడి పోరాడుతుంది. ఈ వీడీజీ గ్రూపులు గ్రామస్థులకు ఆత్మరక్షణ సామర్థ్యాన్ని అందిస్తాయ్. దాంతో.. టెర్రరిస్టుల భయంతో బతకాల్సిన పరిస్థితులు తగ్గిపోతాయి.

### రెండేళ్ల క్రితమే వీడీజీ గ్రూపుల్ని మొదలుపెట్టిన అధికారులు

వాస్తవానికి.. రెండేళ్ల క్రితమే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు అధికారులు. ఇప్పుడు పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పెరిగిన ఉద్రిక్తతలతో పూర్తి స్థాయిలో అలర్ట్ చేశారు. కొన్నిరోజులుగా ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ విలేజ్ డిఫెన్స్ గార్డ్స్‌కి శిక్షణ కూడా సైన్యం వ్యూహంలో ఓ భాగంగా చెబుతున్నారు. ప్రధాని నరేంద్రమోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. ఉగ్రవాదులకు గట్టి సమాధానమిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో.. వీడీజీ గ్రూప్స్‌ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ భద్రతను పటిష్ఠం చేస్తున్నారు.

### వీడీజీలకు సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాల ట్రైనింగ్

ఇండియన్ ఆర్మీ, రాష్ట్రీయ రైఫిల్స్, నార్తర్న్ కమాండ్ లాంటి విభాగాలు.. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్లలో ఎంతో అనుభవం కలిగి ఉన్నాయ్. వాళ్లే.. విలేజ్ గార్డ్స్‌కి అత్యంత సమర్థవంతమైన శిక్షణను అందిస్తున్నారు. సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ వీరికి ట్రైనింగ్ ఇవ్వడం వల్ల.. ఆపరేషనల్ సమన్వయం మెరుగుపడుతుంది. ఇది ఉగ్రవాదుల దాడులను తిప్పికొట్టడంలో ఎంతో ఉపయోగపడుతుంది.

### డ్రోన్లు, థర్మల్ ఇమేజింగ్, నైట్ విజన్ టెక్నాలజీలు

సరిహద్దుల్లో ఉగ్రవాదుల చొరబాట్లను నిర్మూలించేందుకు.. మన సైన్యం డ్రోన్లు, థర్మల్ ఇమేజింగ్, నైట్ విజన్ లాంటి టెక్నాలజీలను ఉపయోగిస్తోంది. వీటిని.. వీడీజీ గ్రూపులకు పరిచయం చేయడం ద్వారా వారి సామర్థ్యం కూడా పెరుగుతుంది. టెర్రరిస్టులు ఎక్కువగా కొండ ప్రాంతాల్లో దాక్కునే అవకాశం ఉన్నందున.. సైన్యం.. విలేజ్ డిఫెన్స్ గార్డులకు గెరిల్లా యుద్ధ వ్యూహాలు, సెర్చింగ్ ఆపరేషన్లపైనా శిక్షణ ఇస్తోంది. మరోవైపు.. మన సైన్యం సన్నద్ధతను, విలేజ్ డిఫెన్స్ గార్డుల ట్రైనింగ్‌ని చూసి.. పాకిస్థాన్ కూడా వాతలు పెట్టుకుంటోంది.

### పహల్గామ్ ఉగ్రదాడిపై ఎన్ఐఏ విచారణ వేగవంతం

పీవోకేలోని స్థానిక ప్రజలకు ఇలాంటి ట్రైనింగే ఇస్తోంది. భారత సైన్యం చేసే దాడుల్ని తిప్పికొట్టేందుకు శిక్షణ కార్యక్రమాలను పెంచినట్లుగా వార్తలొస్తున్నాయ్. ఇప్పటికే.. పహల్గామ్ ఉగ్రదాడిపై ఎన్ఐఏ విచారణని వేగవంతం చేసింది. ఈ విలేజ్ గార్డులు కూడా స్థానిక సమాచారాన్ని అందించడంలో సహాయపడుతున్నారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను పెంచడంతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.

# ఎండల తీవ్రతతో తగ్గిన కూరగాయల సాగు

హైదరాబాద్,మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికితోడు దిగుబడులు కూడా తగ్గాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. అకాల వర్షాల వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. అకాల వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. బీర కిలో రూ.80కి పెరిగిపోయింది. అది రిటేల్ మార్కెట్లో వంద వరకు అమ్ముతున్నారు. అంటే రెట్టింపుయింది. బెండ కిలో రూ.రూ.60కి పెరిగింది. అది రిటేల్‌లో 20కి పావు కిలో అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలుదాదాపు రెండు రెట్లు పెరిగింది. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో అకాల వర్షాలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు.

## ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,మే5:ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాలఅభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి బోళ మంత్రి..మనసులో ఏమి ఉంచుకోడు.. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మహారాష్ట్ర బార్డర్ లో నేషనల్ హైవేకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్. రూ. 3526 కోట్లతో 95 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్స్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ అనగానే వెనుబడిన అనే అపోహ ఉండేది కానీ.. ఆదిలాబాద్ లో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. అయితే ఆదిలాబాద్‌ను వెనకబడేశారని అన్నారు. గత పాలకులకు ఈ జిల్లాను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాకముందు 2500కి.మీ రహదారులు హైవే ఉండేది. బీజేపీ అధికారంలోకి వచ్చాక 5100 కి.మీ నేషనల్ హైవేలు నిర్మించాం. దేశంలోని జాతీయరహదారుల కోసం లక్షా 20 వేల కోట్లు- కేటాయించాం.

# అక్షరాలు నేర్పడానికి లక్షల్లో ఫీజులు.. సౌకర్యాల పేరుతో టోపీ

హైదరాబాద్: ప్రైవేటు బడి ఫీజు భారమైంది. అక్షరాలు దిద్దించడానికే లక్షలు దాటింది. గ్రేటర్ హైదరాబాద్ వరకు మరీ క్రమం తప్పుతోంది. ఫలితంగా పిల్లల చదువు తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. తల్లిదండ్రుల ఆశలను మలుచుకున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వివిధ పేర్లతో బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో అత్యాశకు పోయి లక్షలు కుమ్మరిస్తూ భారం భరిస్తున్నారు. ఒకప్పుడు గ్రామర్, కాన్సెప్ట్ స్కూళ్లు అంటే అదేదో బ్రహ్మ పదార్థంలా చూసేవారు. ఇప్పుడు కాన్సెప్ట్ పోయి టాలెంట్, టెక్నో, ఈ-టెక్నో, డీజీ, మోడల్ స్కూల్, ఐఐటీ, జేఈ, సివిల్స్ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను ఊహాలోకంలోకి తీసుకెళ్లేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. విద్య అంటే కేవలం ఓ వ్యాపారంగా మలిచారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లోని చాలా పాఠశాలలు వ్యాపార కార్యాలయాలుగా మారాయి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన మహోన్నతమైన బాధ్యతను కేవలం లాభాలు గడించుకోవడానికే కుయుక్తులు పన్నుతున్నాయి. గ్రేటర్‌లో పాఠశాలలకు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటికే 80 శాతం అడ్మిషన్లు పూర్తయ్యాయి. కనీసం నోటీసు బోర్డుపై ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా చెప్పకుండా పరిమితి లేకుండా ఫీజులను వాళ్లే నిర్ణయిస్తున్నారు. గ్రేటర్‌లోని కొన్ని పాఠశాలల్లో ఎల్‌కేజీకి వసూలు చేస్తున్న ఫీజులు.. ఇంజినీరింగ్, మెడిసిన్, డెంటల్ కాలేజీల ఫీజు కంటే ఎక్కువగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఇంజినీరింగ్‌లో గరిష్ఠంగా అధికంగా రూ.2.15 లక్షల ఫీజు ఉంటే, ఓ పాఠశాలలో ప్రీ ప్రైమరీకి రూ.2.10 లక్షలు వసూలు చేశారు. ఫీజుల కట్టడిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి నియంత్రణ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### సౌకర్యాల పేరుతో టోపీ

అక్షరాలు దిద్దేంచేందుకే లక్షలు వసూలు చేయడానికి సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గ్రేటర్‌లో చాలా పాఠశాలల్లో ఎత్తైన గోడలు, ఏసీ తరగతి గదులు, ప్రత్యేకమైన టేబుళ్లు, కుర్చీలు, ఏసీ బస్సులు, డిజిటల్ బోర్డులు, డిజిటల్ మెటీరియల్ చూపి, భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంత గొప్పగా సౌకర్యాలు ఉన్నా, బోధన తీరులో గొప్ప మార్పులేమైనా ఉంటాయా? అంటే విద్యావేత్తల నుంచి లేదనే సమాధానమే వస్తున్నది. తమను పెద్ద పాఠశాలల్లో చదివించాలన్న పిల్లల తల్లిదండ్రుల తపనే తప్ప అంతర్జాతీయ ప్రమాణాలు అని చెబుతున్న పాఠశాలల్లో ప్రమాణాలు సాధారణ పాఠశాలల మాదిరిగానే ఉన్నాయని వారు చెప్పారు. ఇంటర్నేషనల్ బోర్డు తగిలించుకున్న పాఠశాలలు ఎల్‌కేజీకే రూ.1.25 లక్షలకు వసూలు చేస్తున్నాయి.

### అనుమతుల్లేకున్నా దర్జాగా బోర్డులు

హైదరాబాద్‌లో 3,500 వరకు ప్రైవేట్, హైదరాబాద్ పాఠశాలలు ఉన్నాయి. చాలా విద్యాసంస్థలు ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో రాజ్యమేలుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా దర్జాగా బోర్డులు తగిలించుకొని దందా చేస్తున్నారు. సీఐఎస్ (కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్) గుర్తింపు ఉన్న పాఠశాలలు మాత్రమే ఇంటర్నేషనల్ బోర్డులు పెట్టుకోవాలి. ఈ గుర్తింపు కోసం



దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను ఆ సంస్థ అన్ని విధాలుగా పరిశీలించి ఆమోదం తెలుపుతుంది. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, బోధనా సామగ్రి వంటి 25 వస్తువులను తీసుకుని గ్రేడింగ్స్ జారీ చేస్తుంది. కానీ చాలా పాఠశాలలు గుర్తింపు లేకున్నా ట్యాగ్ తగలించుకుంటున్నాయి.

### నోటీస్ బోర్డుపై ఫీజుల జాబితా పెట్టిస్తాం

పాఠశాలల్లో అక్రమ ఫీజుల వసూళ్లపై ఫిర్యాదులు అందుతున్నాయి. అక్రమ ఫీజులపై కఠినంగా వ్యవహరిస్తాం. ఈ ఏడాది పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజుల జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేసేలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు ఇచ్చాం. ఆ ఫీజులు అధికంగా వసూలు చేస్తే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయొచ్చు. -రోహిణి, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి

### ఫీజు చెల్లించాలంటే గ్రూపుల్లోకి లాగుతున్నారు

ఫీజులు ఇష్టానుసారం పెంచుతున్నారు. వారు నిర్ణయించిన తేదీల్లో చెల్లించాలంటే కనీసం సమయం కూడా ఇవ్వకుండా విద్యార్థుల తల్లిదండ్రుల గ్రూపుల్లో ఫీజు చెల్లించలేదంటూ పేర్లు పెట్టి పరువు తీస్తున్నారు. దీంతో చిన్నారులు బాధపడాల్సి వస్తోంది. కనీసం వెసులుబాటు కూడా ఇవ్వడం లేదు. చిన్నతరహా స్కూళ్లలోనూ ఫీజులు రూ.50 వేలకు పైగానే వసూలు చేస్తున్నారు. -ప్రకాశ్, హైదరాబాద్

## హరిరామ్ ఆస్తులపూ ఎసిబి ఆరా

హైదరాబాద్,ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈఎన్‌సి హరిరామ్ ఏసీబి కస్టడి కొనసాగుతోంది. ఇప్పటికే హరిరామ్ ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈఎన్సీ హరిరామ్ ను ఐదు రోజుల పాటు కస్టడీకి అనుమతిచ్చింది కోర్టు. హరిరామ్ ను చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబి కస్టడులోకి తీసుకుంది. ఏసీబీ ప్రధాన కార్యాలయంలో హరిరామ్ ఆస్తులపై ఏసీబీ ఆరా తీస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 కోట్ల రూపాయల ఆస్తులను గుర్తించింది ఏసీబి. బహిరంగ మార్కెట్ వీటి విలువ పదిరెట్లు-. వంద కోట్లకు పైగా హరిరామ్ ఆస్తులను గుర్తించింది ఏసీబి.మంగళవారం వరకు హరిరామ్ ను ఏసీబి విచారించనున్నది. కస్టడీలో భాగంగా హరి రామ్ కు చెందిన లాకర్లను ఓపెన్ చేయనున్నది ఏసీబి. లాకర్లు ఓపెన్ చేస్తే హరీ రామ్ ఆస్తుల విలువ పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఇంత భారీ స్థాయిలో ఆస్తులను కూడా పెట్టిన హరిరామ్ వెనకాల ఉన్నది ఎవరు అన్న కోణంలోనూ విచారిస్తోంది ఏసీబీ. హరి రామ్ ఇంట్లో సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల

## చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు

హైదరాబాద్,అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. ఇప్పుడు సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. వ్యాపారులు కూడా సమయం చూసి ధరలు పెంచేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతున్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. దీనికితోడు జీఎస్టీ వడ్డింపులు శరాఘాతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.2వేల వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.950అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.560కి చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య

# యుద్ధానికి ముహూర్తం ఫిక్స్..? ఆ రోజే తొలి దాడి




జమ్ము కశ్మీర్: మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపంగి నూనె అన్నట్లు ఉంది ఇప్పుడు పాకిస్తాన్ పరిస్థితి. లోపల భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. బయటికి మాత్రం భీకరంగా ఉన్నట్లు నటిస్తుంది. భారత్ దాడి చేస్తే తిప్పికొడతామని, మా దగ్గర సైన్యం ఉంది.. న్యూక్లియర్ బాంబులున్నాయంటూ ప్రగల్భాలు పలుకుతోంది. త్వరలో భారత్ ప్రతీకార చర్యగా పాకిస్తాన్‌పై దాడి చేస్తుందని వార్తలు వస్తున్న క్రమంలో రష్యాలోని పాక్ దౌత్యవేత్త ముహమ్మద్ ఖలీద్ జమాలీ ఓ ప్రకటన చేశారు. భారత్ తమపై దాడి చేసేలా ఉందని, దానికి సంబంధించిన ప్లాన్ అంతా లీక్ అయినట్లు ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు.

భారత దాడిని పాక్ తిప్పి కొడుతుందన్న..

భారత్ దాడిని పాక్ తిప్పికొడుతుందని, అణువాయుధాలతో దాడి చేస్తుందని చెప్పుకొచ్చాడు ఖలీద్. పాక్ చేతికి కొన్ని డాక్యుమెంట్స్ చిక్కాయని.. వాటిని బట్టి చూస్తే భారత్ తమ దేశంలోని కొన్ని చోట్ల దాడులు చేయాలనుకుంటుందని ఆరోపించారు. భారత్ ఎప్పుడెప్పుడు ప్రతీకారం తీర్చుకుంటుదా అని పాక్ బిక్కు బిక్కుమంటూ బతుకుతుంది. భారత ఆర్మీ సైనిక చర్యలకు భయంతో వణికిపోతుంది. ఈక్రమంలోనే మే 9లోపు భారత్ సైనిక చర్య ఉంటుందని ఓ వార్త వచ్చింది. ప్రధాని మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రష్యా పర్యటన రద్దు చేసుకున్న క్రమంలో.. భారత్ ఏదో పెద్దదే ప్లాన్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మే 9 లోపే సైనిక చర్య ఉంటుందంటున్న నిపుణులు

మే 9న రష్యాలో జరిగే విక్టరీ పరేడ్‌కు మోడీ, రాజ్‌నాథ్ సింగ్ వెళ్లాల్సి ఉంది. అయితే ఉన్నపళంగా పర్యటనను రద్దు చేసుకుని.. రక్షణ సహాయ మంత్రి సంజయ్‌ని రష్యాకు పంపిస్తున్నారు. దీంతో భారత్ ఏం ప్లాన్ చేస్తుందని ఇటు పాక్‌తో పాటు.. అటు ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో అమెరికా భారత్‌లు పలు సూచనలు చేసింది. సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని తెలిపింది. అమెరికా విన్నపంపై స్పందించిన భారత్.. ఉగ్రవాదంపై పోరు ఆపేది లేదని తేల్చిచెప్పింది.

రంగంలోకి దిగిన పీఓకేలో రిజర్వ్ బలగాలు

పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై భారత్ దాడి చేస్తుందని పాక్ భావిస్తుంది. ఆ భయంతో అక్కడి పౌరులకు పాక్ సైనిక శిక్షణ ఇస్తుంది. పీఓకేలో రిజర్వ్ బలగాలను రంగంలోకి దింపింది. బంకర్లు శుభ్రం చేస్తుంది. ఏ క్షణమైనా భారత్ దాడి చేస్తుందని, స్థానికులు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, మందులు సిద్ధం చేసుకోసుకోవాలని సూచించింది.

భారత్, పాక్ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

పాక్.. బోర్డర్‌లో కయ్యానికి కాలు దువ్వడం మాత్రం ఆపడం లేదు. భారత్, పాక్ సరిహద్దుల్లో రోజు రోజుకు ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్నాయి. వరుసగా పదోరోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఎల్‌వోసీ ప్రాంతాల్లో భారత సైనిక పోస్టులే టార్గెట్‌గా పాక్ సైన్యం కాల్పులకు దిగుతోంది. అయితే పాక్ కాల్పులను భారత సైన్యం తిప్పికొట్టింది.

బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీతో పాకిస్తాన్ అంతర్యుద్ధం

ఇదిలా ఉంటే.. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీతో.. పాకిస్తాన్ అంతర్యుద్ధం ఎదుర్కొంటోంది. బలూచిస్థాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని తిరుగుబాటు చేస్తున్నారు. పాక్ సైనికులను హతమార్చుతూ.. ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తున్నారు. ఈ క్రమంలో నెమ్మది నెమ్మదిగా బలూచిస్థాన్‌పై పాక్ నియంత్రణ కోల్పోతుంది. అటు తమ ప్రాంతం వీడి వెళ్లాలని.. పాక్, చైనా సైన్యానికి బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ హెచ్చరికలు జారీ చేసింది.

బలూచిస్థాన్ ఆర్మీపై నియంత్రణ కోల్పోతున్న పాక్ ప్రభుత్వం

బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఏమాత్రం తగ్గడం లేదు. పాక్ దళాలపై పట్టు సాధిస్తుంది. క్వెట్టా నగరాన్ని స్వాధీనం చేసుకునే దిశగా దాడులు చేస్తుంది. ఇప్పటికే మంగోచార్ పట్టణంలోని అనేక భవనాలను బలూచ్ తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది సైనికులు, అధికారులను కూడా బంధించారు.

క్వెట్టా నగరాన్ని స్వాధీనం చేసుకునే దిశగా దాడులు

పాకిస్తాన్ పశ్చిమ సరిహద్దుల్లో పెరుగుతున్న సంక్షోభం ఇస్లామాబాద్ అంతర్గత భద్రతకు సవాలుగా మారింది. భారత్–పాకిస్తాన్ ఉద్రిక్తతల మధ్య ఎదురవుతున్న క్రమంలో.. ప్రాంతీయ స్థిరత్వంపై కొత్త ఆందోళనలు లేవనెత్తుతున్నాయి.

# జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు?

హైదరాబాద్, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సంవత్సరంగా కాలంగా ఆలస్యమవుతున్న సర్పంచ్ ఎన్నికలను జూలైలో నిర్వహించాలని యోచిస్తున్నట్టు వినికిడి. ఈ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పర్యటన సందర్భంగా మంత్రుల సమావేశంలో పంచాయతీ ఎన్నికల అంశం చర్చకు వచ్చినట్టు తెలిసింది.స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అంశంలో పెండింగ్‌లో ఉన్నందున పాత రిజర్వేషన్ ప్రకారమే ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో దాదాపు ఏడాది క్రితమే స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఈ ఎన్నికలను త్వరగా నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల్లో పాలనా వ్యవస్థను గాడిలో పెట్టాలని ప్రభుత్వం యోస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఎన్నికల షెడ్యూల్, ఓటరు జాబితా తయారీ, నామినేషన్ల ప్రక్రియ లాంటి అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో వివరణాత్మక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 12,777

రాష్ట్రంలోని 12,848 గ్రామ పంచాయతీలకు 2019లో ఎన్నికలు జరిగాయి. వాటిలో 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనమైనందున మిగిలిన 12,777 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో మహిళలకు 50% రిజర్వేషన్ అమలైనందున ఈసారి కూడా వారికి సగం సీట్లు దక్కనున్నాయి. గతంలో 2.02 కోట్ల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుచేశారు. ఇప్పుడు కొన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమైనందున గ్రామీణ జనాభా 1.90 కోట్లకు చేరింది. దీని ప్రకారం ఈసారి బీసీలకు 20–22%, ఎస్సీలకు 18–20%, ఎస్టీలకు 8–10% సీట్లు కేటాయించే అవకాశం ఉన్నది. రొటేషన్ అమలుకు ప్రభుత్వం చట్టం చేసినందున గతంలో ఉన్న బీసీ,




ఎస్సీ, ఎస్టీ స్థానాలు ఇప్పుడు మారుతాయి. ఎస్సీ సీటు బీసీ లేదా జనరల్‌కు కేటాయించే అవకాశం ఉంటుంది.

నిలిచిపోయిన గ్రాంట్లు

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలతోపాటు 539 మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు ఫిబ్రవరి 1తో ముగిసింది. 28 జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు 2024 జూలై 5వ తేదీతో ముగియగా.. ము లుగు, ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ జెడ్పీలతోపాటు ఆ 4 జిల్లాల్లోని మండల పరిషత్ పాలకవర్గాల గడువు 2024 ఆగస్టు 5తో ముగిసింది.

గ్రామాలు నిర్వీర్యం

రాష్ట్రంలో గ్రామీణ పరిపాలనా వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో గ్రామాలు నిర్వీర్యమవుతున్నాయి. ప్రజారోగ్య, పారిశుద్ధ్య, తాగునీటి వ్యవస్థలు కుంటుపడిపోయాయి. కనీసం నీళ్ల ట్యాంకులను కూడా శుద్ధిచేసే పరిస్థితి లేదు.– గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి,తెలంగాణ సర్పంచ్‌ల సంఘంరాష్ట్ర అధ్యక్షుడు


# మన మార్కెట్‌లోకి వచ్చేందుకు పాక్ అడ్డదారులు.. భారత్ హైఅలర్ట్



న్యూఢిల్లీ, పహల్గాం దాడి తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి వచ్చే దిగుమతులు అన్నింటిపై భారత్ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయా ఉత్పత్తులను ఎలాగైనా మన మార్కెట్లోకి పంపించేందుకు దాయాది అడ్డదారులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. యూఏఈ, సింగపూర్, ఇండోనేసియా, శ్రీలంక మీదుగా వాటిని భారత్‌లోకి పంపించాలని వ్యూహాలు పన్నుతోంది. దీంతో కస్టమ్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దాదాపు 500 మిలియన్ డాలర్ల విలువైన పాకిస్థానీ పండ్లు, ఎండు కర్జూరాలు, టెక్స్‌టైల్స్, రాక్ సాల్ట్, లెదర్ వస్తువులు తదితర ఉత్పత్తులను ఇతర దేశాల్లో లేబుల్స్ మార్చి, రీప్యాకేజ్ చేస్తున్నట్లు సమాచారం ఉందని సదరు వర్గాలు పేర్కొన్నాయి. అక్కడి నుంచి వాటిని భారత మార్కెట్లోకి ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కస్టమ్స్ అధికారులు ఆ దిగుమతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. కేంద్రం ఆదేశాల మేరకు పాక్‌లో ఉత్పత్తి అయ్యే ఏ వస్తువైనా ఏ మార్గంలోనూ భారత్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.వాస్తవానికి అధికారిక మార్గాల్లో పాక్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువుల విలువ చాలా తక్కువే. కానీ, మూడో దేశం మీదుగా పాక్ నుంచి అనేక ఉత్పత్తులు భారత్‌లో వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులన్నింటినీ నిషేధిస్తున్నట్లు మే 2న కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. 2019లో పుల్వామా దాడి తర్వాత దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. ఆ దేశానికి 'మోస్ట్ ఫేవర్డ్ నేషన్' హోదాను ఉపసంహరించుకున్న కేంద్రం.. పాక్ ఉత్పత్తులపై 200శాతం సుంకం విధించింది. గణాంకాల పరంగా చూస్తే కూడా.. ఈ దిగుమతుల విలువ చాలా తక్కువే. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడినుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకున్నాం. విలువ పరంగా ఈ వాణిజ్యం స్వల్పమే అయినప్పటికీ.. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. తాజా నిర్ణయంతో పొరుగుదేశంలోని ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది.

# వివాదాల విరాగి..కలహాల బేహారి

న్యూఢిల్లీ,ఆధ్యాత్మికత, వ్యాపారం తరచూ కలిసిపోయే భారతదేశంలో రామ్‌దేవ్ బాబా అనే యోగ గురువు ఈ సమ్మేళనాన్ని అసాధారణంగా కలిపి, నడిపిన వ్యక్తి. పతంజలి బ్రాండ్ ద్వారా ఆయుర్వేద ఉత్పత్తులను హిందూ జాతీయవాదంతో ముడిపెట్టి, కోట్లాది మంది హృదయాలను ఆకర్షించిన వ్యక్తి. ఆయన, ఆధ్యాత్మిక బోధకుడి నుండి వివాదాస్పద వ్యాపారవేత్తగా మారిన ప్రస్థానం విమర్శలకు తావిచ్చింది. ఈ దేశంలో మెజారిటీ ప్రజలను మోసగించాలంటే కాషాయానికి మించిన వేషధారణ మరొకటి లేదు. అందుకే ఈ వ్యాపారవేత్త కాషాయం కట్టి, యోగా బాబా అవతారం ఎత్తి, ఇప్పుడు ఆయుర్వేదం ముసుగులో నాసిరకం ఔషధాలు తయారు చేసి అంతర్జాతీయ వ్యాపారవేత్తగా అవతారం ఎత్తాడు. అనేకసార్లు నకిలీ వస్తువుల జాబితాలలో సంబంధిత సంస్థలు రైడ్స్ చేసి పంతంజలి కల్తీ బాగోతాన్ని శాస్త్రీయంగా ప్రకటించారు.అయినా కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి, ఆర్ఎస్ఎస్ రాజకీయ పలుకుబడితో నెట్టుకొస్తున్నారు. తాజాగా, హందర్ద్ లాబొరేటరీస్‌కు చెందిన 'రూహ్ ఆఫ్జా' దక్షిణాసియా ముస్లిం సమాజాలతో ముడిపడిన ఒక పానీయంపై షర్బత్ జిహాద్ అనే వ్యాఖ్యలతో ఆయన మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఈ ఘటన, కొవిడ్– 19 సమయంలో నిరూపితం కాని ఔషధాలను ప్రచారం చేసిన ఆయన చరిత్రతో కలిసి, నీతిహీన వ్యాపార వ్యూహాలను బహిర్గతం చేస్తుంది. ఆ నాసిరకం ఔషధం కొవిడ్‌ను తగ్గిస్తుంది అని నిరూపితం కాని వ్యాపార ప్రకటనలు కేంద్ర వైద్యశాఖా మంత్రి సమక్షంలో, మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ప్రకటించారు. లక్షలాది కొవిడ్ రోగులు నమ్మి మోసపోయారు.అనేకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. సుప్రీం కోర్టు గతంలో ఇలాంటి ఆధార రహిత తప్పుడు ప్రకటనల ప్రచారం పై రామ్ దేవ్ బాబాను, బాలకృష్ణను కూడా తీవ్రంగా మందలించినప్పటికీ, కోర్టుకు క్షమాపణలుచెప్పి తప్పించుకొనప్పటికీ, రామ్‌దేవ్ బాబా బుద్ధులు, పద్ధతులు మారలేదు. కోర్టులో కూడా యోగిగా (కాషాయ వస్త్రాలు ధరించి) కపట నీతినే అనుసరించారు. ఇలాంటి వేషధారుల ప్రభావం సమాజానికి ఎంతటి హాని కలిగిస్తుందో మాటల్లో చెప్పలేము. రామ్‌దేవ్ విజయం వివాదాల నీడలో పెరిగింది. పతంజలి ఉత్పత్తుల సామర్థ్యాన్ని అతిశయోక్తిలతో చూపించారు. వారి ఉత్పత్తులు సర్వరోగ నివారిణిగా వినియోగదారులను తప్పుదారి పట్టించారు. ఈ వ్యాపార ప్రకటనలపై ఆయన ఇతర ఉత్పత్తుల సంస్థల నుండి విమర్శలను ఎదుర్కొన్నారు. షర్బత్ జిహాద్ వివాదం కేవలం మార్కెటింగ్ లోపం కాదు. ఇది ఒక లోతైన సమస్య



లక్షణం.మతాన్ని వ్యాపార లాభం కోసం ఆయుధంగా ఉపయోగించే రామ్‌దేవ్ చర్యలు భారతదేశ సామాజిక సామరస్యాన్ని చెడగొట్టేవిగా ఉంటాయి. ఆధ్యాత్మికత, రాజకీయాలు, వ్యాపారం మధ్య సున్నితమైన గీతలను మసకబార్చేవిగా ఉంటాయి. ప్రభావవంతమైన వ్యక్తుల నియంత్రణా అండదండలు ఉండటంతో గర్వం, నిర్లక్ష్యం, ఎవరూ ఏమీ చేయలేరు అనే ధీమా ఆయన ప్రవర్తనలో దృఢంగా పెరిగింది. సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు ఆయనను జవాబుదారీగా చేయడానికి చర్యలు తీసుకున్నప్పటికీ, ఇటువంటి చర్యలు సరిపోవు. ప్రకటనల నియంత్రణ, ద్వేషపూరిత ప్రసంగాలపై కఠిన శిక్షలు అవసరం. రామ్‌దేవ్ అనుచరులు కూడా ఆయన బోధనలు, విభజన చర్యల మధ్య వైరుధ్యాన్ని గుర్తించాలి. ఐక్యతను బోధించే గురువు విభజనను రెచ్చగొట్టడం ఆయన స్వంత వారసత్వాన్ని దెబ్బతీస్తుంది.రామ్‌దేవ్ కథ ఒక హెచ్చరిక. యోగ బోధకుడి నుండి వ్యాపార దిగ్గజంగా ఎదిగిన ఆయన భారతీయ సంప్రదాయం పట్ల గౌరవాన్ని ఉపయోగించి సామ్రాజ్యాన్ని నిర్మించారు. కానీ, తప్పుదారి ఆరోగ్య దావాలు, సామాజిక విభజన రాగాల ద్వారా ఆయన విశ్వసనీయతను కోల్పోయారు. రూహ్ ఆఫ్జా ఘటన కేవలం ఒక పానీయం వివాదం కాదుబీ ఇది నీతి గీతలను దాటిన ఒక వ్యక్తి జవాబుదారీతనం గురించిన ప్రశ్న. భారతదేశం తన సంక్లిష్ట గుర్తింపును నిర్వహిస్తున్న తరుణంలో, సమాజాన్ని ఉద్ధరించే నాయకులు అవసరం. రామ్‌దేవ్, తన కాషాయం ఆకర్షణీయతా ముసుగు ఉన్నప్పటికీ, దాని ప్రభావం జవాబుదారీతనాన్ని అధిగమించినప్పుడు ఏమవుతుందో చెప్పలేం. ఇంకా కోర్టు నుండి తుది తీర్పు రావాల్సి ఉంది.

# నెల్లూరు పెద్దారెడ్డికి ఎమ్మెల్సీ కావాలట !

నెల్లూరు:నెల్లూరు పెద్దారెడ్లు చాలా మంది ఉన్నారు. అందులో ఆయన కూడా ఒకరు. ఆయనది బలమైన రాజకీయ నేపథ్యం. అన్న మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్ గా ఉన్నారు. ఆయన పలు మార్లు ఎంపీగా గెలిచి నెల్లూరు రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఆ సమయంలోనే ఆయన సోదరుడుగా చంద్రశేఖర్ రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేశారు.ఆయన ఉదయగిరి నుంచి అనేక సార్లు గెలిచి తన సత్తా చాటుకున్నారు. మేకపాటి బ్రదర్స్ మొదట కాంగ్రెస్ లో ఉన్నారు. ఆ తరువాత వైసీపీలో చేరారు. ఇక వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక తన సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని మంత్రి పదవిని మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ఆశించారు అని అంటారు. అది దక్కలేదు సరికదా పార్టీలో తమ మాట చెల్లలేదు అన్న భావనతో ఆయన కూటమి వైపు మళ్ళారు.అలా ఆయన ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఫుల్ గా సపోర్టు చేశారు దాంతో పార్టీ ఆయన మీద యాక్షన్ తీసుకుంది. మొత్తానికి మేకపాటి టీడీపీలో చేరారు. 2024 ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యే టికెట్ వస్తుందని అనుకుంటే అది కాస్తా దక్కలేదు. పోనీ పార్టీ అధికారంలోకి వచ్చింది కదా ఎమ్మెల్సీ అయినా ఇచ్చి తన గౌరవానికి తగిన మర్యాద ఇస్తారు అనుకుంటే అదీ లేదని పెద్దాయన తెగ బాధపడుతున్నారని అంటున్నారు.తనకు కాకపోయినా తన సతీమణీ శాంతకుమారికి అయినా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తారనుకుంటే అది కూడా దక్కలేదని తెలుస్తోంది. దాంతో మేకపాటి తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ప్రచారం సాగుతోంది. తనకు పదవి దక్కకపోవడానికి స్థానిక ఉదయగిరి టీడీపీ నేతలే కారణం అని ఆయన భావిస్తున్నారుట.దాంతో ఆయన వారి మీదనే విమర్శలు చేస్తూ పార్టీలో కొత్త చర్చకు తెర లేపుతున్నారని అంటున్నారు. అయితే మేకపాటి తిరిగి వైసీపీలోకి వెళ్తారని జరుగుతున్న ప్రచారం



కాక రేపుతోంది. దాని మీద చంద్రశేఖర్ రెడ్డి సతీమణి శాంతకుమారి అయితే ఘాటుగా స్పందించారు. తాము టీడీపీని వీడేది లేదని ఇక్కడే ఉంటామని చెబుతూనే చేసిన మేలు గుర్తు చేసుకోలేని వారు అని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే మీద పరోక్ష విమర్శలు చేశారు.దీంతో ఉదయగిరిలో ఏదో జరుగుతోంది అన్నది అయితే పసుపు పార్టీ పెద్దలకు అందుతున్న సమాచారంగా ఉంది అయితే నెల్లూరు పెద్దారెడ్డిని హైకమాండ్ పిలిచి బుజ్జగిస్తుందా ఏదైనా పదవి ఇస్తారా లేక లైట్ తీసుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. అయితే పదవులు ఊరకే రావు అన్నది కూడా కొత్త రాజకీయ సామెతగా గుర్తు చేసుకోవాలి. ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి వచ్చి ఎన్నికల్లో కొంత హెల్ప్ చేస్తే చేయవచ్చు కానీ మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికే టీడీపీ ఇపుడు గుర్తించి గౌరవిస్తోందని అంటున్నారు ఓపికగా ఉంటే ఏమైనా మంచి జరగవచ్చేమో కానీ ఇలా అసంతృప్తిని బయటేసుకుంటే మాత్రం కష్టమే అని అంటున్నారు.

# ఎన్నికల సేవలన్నీ ఒకే వేదికపైకి





న్యూఢిల్లీ, దేశంలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, నిర్వహణ, ఫలితాల వెల్లడి, అభ్యర్థుల వివరాలు, ఓటర్ల నమోదు, సందేహాల నివృత్తి.. ఇలా ఎన్నికల సేవలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెచ్చేందుకు సరికొత్త డిజిటల్ వేదికను రూపొందించింది కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ). ఇప్పటి వరకు ఉన్న సుమారు 40 మొబైల్, వెబ్ అప్లికేషన్లను అనుసంధానం చేస్తూ త్వరలోనే 'ఈసీఐనెట్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఈసీఐ ఆదివారం ప్రకటించింది. ఇది అందుబాటులోకి వస్తే ఇకపై ఎన్నికల సంఘానికి సంబంధించిన వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం ఉండదని వివరించింది.

40 యాప్‌లతో అనుసంధానం..

ఎన్నికల సంఘం సమాచారం కోసం ఇప్పటి వరకు ఉపయోగిస్తున్న 40 వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌ల అనుసంధానంతో 'ఈసీఐనెట్'ను రూపొందించినట్టు ఈసీఐ తెలిపింది. అఫిడవిట్ పోర్టల్, ఇండియా ఎ వెబ్, రిజల్ట్ వెబ్‌సైట్, ఎలక్షన్ 24(ఆర్కైవ్), ఈసీఐ స్వీప్, ఈసీఐ వెబ్‌సైట్, ఫెంబోసా, వాయిసనెట్, మిత్ వర్సెస్ రియాలిటీ, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ, సీ విజిల్ పోర్టల్, ఈఎంఎస్, ఆర్టీఐ పోర్టల్, ఎన్కోర్, మీడియా వోచర్, సువిధ పోర్టల్, అబ్జర్వర్ పోర్టల్, ఎలక్షన్ ప్లానింగ్, ఐఈఎంఎస్, పీపీఆర్ టీఎంఎస్, ఏరోనెట్ 2.0, ఓటర్స్ సర్వీస్ పోర్టల్, సర్వీస్ ఓటర్ పోర్టల్, ఈటీపీఎంబీఎస్, ఎన్జీఎస్పీ, ఎలక్టోరల్ సెర్చ్ వెబ్ సైట్లతో పాటు ఎరోనెట్ యాప్, బీఎల్‌వో యాప్, సీవిజల్, డిసైడర్, ఎన్‌కోర్ నోడల్, ఈఎసఎంఎస్, ఇన్వెస్టిగేటర్, కేవైసీ, మానిటర్, అబ్జర్వర్, సాక్ష్యం, సువిధ, ఓటర్ టర్నౌట్ తదితర అప్లికేషన్లన్నీ ఒకే గొడుగు కిందకు రానున్నాయని ఈసీఐ వివరించింది.

# కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అరెస్టు..



హర్యానా: మనీలాండరింగ్ కేసుకు సంబంధించి హర్యానా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చోకర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. దీన్ దయాళ్ ఆవాస్ యోజన పథకం కింద దాదాపు రూ. 1,500 కోట్లను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, సికందర్ సింగ్, అతని తండ్రితో కలిసి, 1,500 మందికి పైగా గృహ కొనుగోలుదారులను మోసం చేసి, ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో కలిసి నకిలీ నిర్మాణ ఖర్చులను చూపించి రూ. 400 కోట్లు స్వాహా చేశారని ఈడీ గుర్తించింది. అయితే, గత ఏడాది మార్చిలోనే అతడ్ని అరెస్ట్ చేయగా.. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరుగుతుంది.కాగా, మార్చి 2024లో, సికందర్‌ను ఈడీ అరెస్టు చేసింది. కానీ, పంజాబ్– హర్యానా హైకోర్టులో అతడు వేసిన బెయిల్ పిటిషన్ తిరస్కరించిన తర్వాత.. జైలు శిక్షను తప్పించుకోవడానికి అనారోగ్యంతో ఉన్నట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో అతడికి చికిత్స పూర్తయ్యే వరకు అరెస్ట్ చేయొద్దని తెలిపింది. కాగా, రోహతక్‌లోని ఒక ఆసుపత్రి వెలుపల స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించాడు. ఈ విషయాన్ని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com